సాక్షి జగిత్యాల

మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



శ్రావణ సందడి

మల్లాపూర్ : శ్రీకనకసోమేశ్వరస్వామి కొండపై సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. తొలుత కోనేరులో పుణ్యస్నానాలు చేశారు.



భక్తజనసంద్రం

సారంగాపూర్ : శ్రావణంలో చివరి సోమవారం కావడంతో శ్రీదుబ్బరాజేశ్వరస్వామి సన్నిధి భక్తులతో కిక్కిరిసింది.

గరిష్టం/కనిష్టం 31.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి. జిల్లాలో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు ఎమ్మెల్సీ కవిత రాక



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సంజయ్‌కుమార్

జగిత్యాల/జగిత్యాలరూరల్: ఎమ్మెల్సీ కవిత బుధవారం జగిత్యాలలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. బీఆర్ఎస్ నియోజకవర్గ కార్యకర్తలతో ఆమె ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చల్‌గల్ పండ్ల మార్కెట్‌లో జరుగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు వివరించారు. ఈమేరకు సభా ఏర్పాట్లను ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి(కోరుట్ల): క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో సోమవారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీలను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు తమకు ఆసక్తిఉన్న క్రీడల్లో రాణించాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూ ప్రిన్సిపాల్‌గా కామాక్షిప్రసాద్



బాధ్యతలు స్వీకరిస్తున్న కామాక్షి ప్రసాద్

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం నాచుపెల్లి జేఎన్టీయూ ప్రిన్సిపాల్‌గా హైదరాబాద్ జేఎన్టీయూ సీఎస్ఈ విభాగానికి చెందిన కామాక్షిప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రమేశ్ ఖమ్మం జేఎన్టీయూకు 10రోజుల క్రితం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కామాక్షి ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. కొత్త ప్రిన్సిపాల్‌కు ఆయా డిపార్ట్‌మెంట్ల హెచ్‌వోడీలు, ఆచార్యులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆశా కార్యకర్తల అరెస్ట్



పోలీస్‌స్టేషన్‌లో ఆశా వర్కర్లు

సారంగాపూర్(జగిత్యాల): తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సోమవారం హైదరాబాద్ తరలివెళ్తున్న ఆశా కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి సంఘీభావం తెలిపారు. నాయకులు పడాల తిరుపతి, వరుణ్‌కుమార్ ఉన్నారు.

నాణ్యమైన వైద్యం



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

జగిత్యాలరూరల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్‌క్యూఏఎస్ ప్రోగ్రాంలో భాగంగా సోమవారం రికార్డులను తనిఖీ చేశారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకోవాలన్నారు. గర్భిణులకు నాణ్యమైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు జైపాల్‌రెడ్డి, శివకుమార్, ఏఎన్‌ఎంలు సంధ్య, రజిత తదితరులు పాల్గొన్నారు.

రామకిష్టయ్యకు పురస్కారం



ధర్మపురి: బాలసాహిత్యంలో విశేష సేవలు అందిస్తున్న పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సంగనభట్ల చిన్నరామకిష్టయ్యకు సోమవారం హైదరాబాద్‌లో తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కారం అందజేసింది. ఆయనను పలువురు అభినందించారు.

మళ్లీ క్రీడా సంబురం

కథలాపూర్(వేములవాడ): దాదాపు మూడేళ్ల తర్వాత జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీల నిర్వహణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఏటా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. అయితే, కరోనా మహమ్మారి ఈ పోటీలపై తీవ్ర ప్రభావం చూపింది. తద్వారా సుమారు మూడేళ్లపాటు ఎస్జీఎఫ్ పోటీలు నిర్వహించలేకపోయింది. దీంతో ప్రతిభగల విద్యార్థులు క్రీడలకు దూరమయ్యామని నిరాశకు గురయ్యారు. ప్రస్తుతం పోటీలకు ఏర్పాట్లు చేస్తుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



క్రీడా షెడ్యూల్ ఇదే..

- మండలస్థాయి టోర్నీ : ఈనెల 15వ తేదీలోగా పూర్తిచేయాలి
- జిల్లాస్థాయిలో టోర్నీ : ఈనెల 20వ తేదీన అండర్–17 బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు
- 21న అండర్–17 బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్
- 22న అండర్–14 బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్
- 23న అండర్–14 బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్
- 25న అండర్ –14, 17 బాలికలకు అథ్లెటిక్స్
- 26న అండర్– 14, 17 బాలురకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తారు.



సత్తా చాటుతాం

మూడేళ్లుగా ఎస్‌జీఎఫ్ పోటీలు నిర్వహించడం లేదు. దీంతో నిరాశకు గురయ్యాం. ఇప్పుడు పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉంది. పోటీల్లో సత్తా చాటుతాం.

– గొల్లమాడ వెన్నెల, పదోతరగతి, గంభీర్‌పూర్



ప్రాక్టీస్ చేస్తున్నాం

క్రీడలు అంటే పట్టణాలకే పరిమితం అనే అపోహలున్నాయి. గ్రామీణ విద్యార్థులు సత్తా చాటేందుకు ఎస్‌జీఎఫ్ క్రీడలు దోహదపడతాయి. పోటీల్లో సత్తా చాటేందుకు ప్రాక్టీస్ చేస్తున్నాం.

– బద్దం నిహాల్‌రెడ్డి, ఎనిమిదో తరగతి, భూషణరావుపేట



వసతులు కల్పించాలి

ఎస్‌జీఎఫ్ పోటీల నిర్వహణ సందర్భంగా క్రీడాకారులకు అన్ని వసతులు కల్పించాలి. వసతులు లేకపోతే నీరసపడతారు.

– బావు అక్షయ్, తొమ్మిదో తరగతి, కథలాపూర్

పకడ్బందీగా పోటీలు



జిల్లాలోని పీఈటీలతో సమావేశమయ్యాం. డీఈవోతో చర్చించి ఎస్‌జీఎఫ్ షెడ్యూల్ విడుదల చేశాం. షెడ్యూల్ ప్రకారం ఈనెల 15లోగా మండల, 26లోగా జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తాం. జిల్లా స్థాయి పోటీలను జగిత్యాల స్వామీ వివేకానంద మినీ స్టేడియంలో నిర్వహిస్తాం. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– లక్ష్మీరామ్ నాయక్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి

- 'ఎస్‌జీఎఫ్' పోటీల నిర్వహణకు అధికారుల కసరత్తు
- షెడ్యూల్ విడుదల చేసిన 'ఫెడరేషన్'
- మూడేళ్ల తర్వాత స్కూల్, కళాశాల విద్యార్థులకు ఆటల పోటీలు
- మైదానాల్లో అప్పుడే మొదలైన క్రీడా సందడి



కోరుట్ల మోడల్ స్కూల్‌లో ఖోఖో పోటీలు నిర్వహిస్తున్న పీఈటీ

మూడు విభాగాల్లో పోటీలు..

- పాఠశాలలు, కళాశాలల స్థాయిలో అండర్ –14, అండర్–17, అండర్–19లో బాలబాలికలకు వేర్వేరుగా ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. మండలస్థాయి నుంచి ప్రారంభమై జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటితే క్రీడాకారులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తారు. వీటిద్వారా ఉన్నత విద్య, ఉద్యోగాల ఎంపికలో రిజర్వేషన్ సౌకర్యం వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు. అందుకే ఎస్‌జీఎఫ్ క్రీడల్లో పాల్గొనేందుకు విద్యార్థులు అత్యంత ఉత్సాహం చూపిస్తున్నారు.

సందడి షురూ..

- ఈ ఏడాది గత జూన్‌లో పాఠశాలలు ప్రారంభమయ్యాయి.
- అయితే, ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణపై ఇప్పటి దాకా ఎలాంటి పురోగతి కనిపించలేదు.
- దీంతో ఆటలపై ఆసక్తిఉన్న విద్యార్థులు నిరాశకు గురయ్యారు.
- ఏటా విద్యాసంవత్సరం ప్రారంభమయ్యాక జిల్లాలోని పీఈటీలతో సమావేశం నిర్వహించి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీల ఎంపికపై అధికారులు నిర్ణయం తీసుకునేవారు.
- ప్రతీ ఆగస్టులో మండల, జిల్లాస్థాయి, సెప్టెంబర్‌లో రాష్ట్రస్థాయి.. ఆ తర్వాత జాతీయస్థాయిలో క్రీడాపోటీలకు ఎంపికలు నిర్వహిస్తారు.
- కరోనా ప్రభావంతో మూడేళ్లుగా ఎస్‌జీఎఫ్ పోటీలు నిర్వహించలేదు.
- దీంతో ఈసారి పోటీలు ఉంటాయో లేదోనని విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో అయోమయం నెలకొంది.
- ఎట్టకేలకు జిల్లా అధికారులు సోమవారం ఎస్జీఎఫ్ షెడ్యూల్ విడుదల చేయడంతో క్రీడాకారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.
- పాఠశాలలు, కళాశాలల స్థాయిల్లో ఆటల సందడి నెలకొంది.

నాలుగు దశల్లో నిర్వహణ..

ఎస్‌జీఎఫ్ క్రీడలను నాలుగు దశల్లో నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. తొలుత మండల, ఆ తర్వాత జిల్లా, తదుపరి ఉమ్మడి జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. ఇందులో పాత జిల్లాల జట్టు ఏర్పాటు చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని అధికారులు వివరించారు.

మళ్లీ వస్తామని చెప్పి.. వదిలేసి వెళ్లారు

- రెండ్రోజులుగా అచేతనావస్థలో మహిళ
- సాయం చేసిన యువకులు, కౌన్సిలర్
- జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలింపు



అచేతనావస్థలు ఉన్న మహిళ

కోరుట్ల: 'ఇక్కడ ఉండు.. ఇప్పుడే వస్తాం' అని చెప్పి ఓ మహిళను వదిలేసి వెళ్లిన సంఘటన జగిత్యాల జిల్లా కోరుట్లలోని ఐబీ రోడ్డులో చోటు చేసుకుంది. సదరు మహిళ రెండు రోజులుగా దిక్కుమొక్కు లేక చలిలో..వానలో వాటర్ ట్యాంక్ కింద ఉండి తన వాళ్ల కోసం ఎదురుచూస్తోంది. ఆమె దీనస్థితి అందరినీ కలచివేసింది. వివరాల్లోకి వెళితే.. రెండు రోజుల క్రితం కొందరు ఆటోలో వచ్చి ఐబీ రోడ్డు వాటర్ ట్యాంక్ దగ్గర అనారోగ్యంతో ఉన్న మహిళ(45)ను వదిలేసి వెళ్లారు. అదే ఏరియాలో ఉండే మైనార్టీ యూత్ యువకులు అబుబకర్, షోయబ్ రెండు రోజులుగా వాటర్ ట్యాంక్ కింద ఉన్న మహిళను గుర్తించి ప్రశ్నించగా తనను రెండు రోజుల క్రితం తమవాళ్లు ఆటోలో తెచ్చి ఇక్కడ వదిలేశారని చెప్పింది. దీంతో ఆమె అనారోగ్య పరిస్థితిని గుర్తించిన యువకులు.. వెంటనే వార్డు కౌన్సిలర్ పేర్ల సత్యంకు సమాచారం ఇచ్చారు. స్పందించిన వార్డు కౌన్సిలర్ సత్యం.. సోమవారం రాత్రి అక్కడికి వచ్చి మహిళ వివరాలు తెలుసుకున్నారు. తన పేరు మిర్యాల లక్ష్మి అని, తనది నిజామాబాద్ జిల్లా అని, తమ వాళ్లు వదిలేసి వెళ్లారని అస్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. ఆమె చేయిపై విజయ అని పచ్చబొట్టు ఉందని కౌన్సిలర్ సత్యం చెప్పారు. మహిళను యూత్ ప్రతినిధులు అబుబకర్, షోయబ్‌తో కలిసి కోరుట్ల ప్రభుత్వాసుపత్రిలో చేర్పారు. ఆ తర్వాత పోలీసులకు సమాచారం ఇచ్చారు. మహిళ సరైన సమాధానాలు చెప్పకపోగా కాలుకు పుండు ఉన్నట్లుగా గుర్తించిన వైద్యులు.. ఆమెకు ప్రాథమిక చికిత్స చేయించి జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తప్పుడు దరఖాస్తు చేస్తే చర్యలు

జగిత్యాల: బదిలీలు, పదోన్నతుల విషయంలో ఉపాధ్యాయులు ఎవరైనా తప్పుడు సమాచారంతో దరఖాస్తు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో జగన్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం తప్పుడు దరఖాస్తులు చేసుకున్నారని ఆరోపిస్తూ ఎస్టీయూ నాయకులు డీఈవోకు ఒక వినతిపత్రం అందజేశారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ, ప్రతీదరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. తప్పుడు సమాచారం ఇస్తే బాధ్యులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏ జాబితాలో చేర్చండి



జీవన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ముదిరాజ్‌లు



సంఘీభావం తెలుపుతున్న శ్రావణి

- సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాలటౌన్: ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ– ఏ జాబితాలో చేర్చాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ముదిరాజ్‌ల విజ్ఞప్తి మేరకు ఆయన సోమవారం సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తమను బీసీ–ఏ జాబితాలో చేర్చాలని కోరుతూ ముదిరాజ్‌లు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. అంతకుముందు స్థానిక మంచినీళ్ల బావి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి తమ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, జనాభా ప్రాతిపదికన బీసీలకు 40శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతో తోపాటు కనీసం వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్ చౌరస్తాలో అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన సమ్మెకు వారు సంఘీభావం తెలిపారు. కర్ణాటక వంటి రాష్ట్రాల్లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు నమోదు



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం ఓటరు నమోదు, జాబితా సవరణపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ యాస్మిన్‌బాషా అధికారులతో మాట్లాడారు. నూతన ఓటరు నమోదు, జాబితాలో సవరణల కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు, ట్రాన్స్‌జెండర్లు, ఆదివాసీ పెద్దలతో తరచూ సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యపర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులకు ఓటరు జాబితాలో ప్రత్యేక మార్కింగ్ చేస్తామని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో స్వీప్ నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, ఆర్డీవో నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలకు పకడ్బందీ భద్రత

- ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: జిల్లాలో ఈనెల 18 నుంచి నిర్వహించే గణేశ్ ఉత్సవాలతోపాటు మిలాద్ ఉన్ నబీ వేడుకలకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని ఎస్పీ భాస్కర్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని అన్నారు. డయల్ 100 నంబరుకు అందే ఫోకాల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. రాత్రి 10 గంటల వరకే స్పీకర్లను వినియోగించాలన్నారు. డీజే ఏర్పాటుకు అనుమతి లేదని తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేశ్ మండప నిర్వాహకుల కమిటీ వివరాలు తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో బందోబస్తు పెంచాలని సూచించారు. నిమజ్జనోత్సవానికి అవసరమైన పోలీస్ బందోబస్తు, గజఈతగాళ్లు, క్రేన్లు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అడిసనల్ ఎస్పీ ప్రభాకరరావు, డీఎస్పీలు రవీంద్రకుమార్, వెంకటస్వామి, రవీందర్‌రెడ్డి, రఘుచందర్, డీపీ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిని సన్మానిస్తున్న పోలీసు అధికారులు

పోలీసుల పాత్ర కీలకం

ఎన్నికల నిర్వహణలో పోలీసుల పాత్ర కీలకమని ఎస్పీ భాస్కర్ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అసెంబ్లీ ఎన్నికల నియమావళిపై అసిస్టెంట్ ప్రొఫెసర్ పడాల తిరుపతి పోలీసులకు అవగాహన కల్పించారు. తొలుత ఎస్పీ మాట్లాడుతూ, నిబంధనలకు లోబడి పోలీసులు పనిచేయాలన్నారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలీసు సెక్టార్ అధికారులను ఇప్పటికే నియమించామని తెలిపారు. సమస్యలు సృష్టించే వారిని గుర్తించి బైండోవర్ చేయాలని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాల్లో విధిగా పర్యటించాలని చెప్పారు. అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు రవీందర్‌కుమార్, వెంకటస్వామి, రవీందర్‌రెడ్డి, రవిచందర్, డీపీ రంగారెడ్డి, ఎస్బీ సీసీఐ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

అంతా ప్యాకెట్ల మయం

- అధికారుల పర్యవేక్షణ కరువు
- అనుమతి లేకుండానే తయారీ
- నష్టపోతున్న వినియోగదారులు

- జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగి సినిమాకు వెళ్లాడు. పాప్‌కార్న్ కొనుగోలు చేశాడు. దానికి ఎలాంటి స్టిక్కర్‌లేదు. ప్యాకెట్ రూ.40కిపైగా ధరకు అమ్మాడు. దీంతో అతడు లీగల్ మెట్రాలజీ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేశాడు. అధికారులువెంటనే థియేటర్‌కు వెళ్లి కేసు నమోదు చేశారు.
- జగిత్యాల అశోక్‌నగర్‌కు చెందిన ఉపాధ్యాయుడు కూరగాయల మార్కెట్‌కు వెళ్లాడు. కూరగాయలు కొనుగోలు చేశాడు. కిలోకు పావుకిలో వరకు తక్కువగా రావడంతో అధికారులకు ఫిర్యాదు చేశారు.

జగిత్యాల: జిల్లాలోని కిరాణాలు, సూపర్ మార్కెట్లలో వివిధ వస్తువులను ప్యాకెట్లరూపంలో విక్రయిస్తున్నారు. వీటిపై తయారీ, గడువు తేదీ, బరువు, ధర స్టిక్కర్లు వేయకుండానే విక్రయిస్తున్నారు. ప్రజలు వివిధ పనులతో బిజీగా ఉండటంతో వ్యాపారులు దానిని అవకాశంగా మార్చుకుని ప్యాకెట్ల రూపంలో వస్తువులు అంటగడుతున్నారు. సూపర్ మార్కెట్ల నుంచి చిన్న కిరాణాల్లోనూ ప్యాకింగ్‌పై అన్ని వివరాలు ఉండాలి. వ్యాపారులు నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. పావుకిలో, అర్ధకిలో, కిలో రూపంలో ప్యాకెట్లు నింపుతూ వ్యాపారులు విక్రయిస్తున్నారు. దీంతో తూకంలో తేడాలు వస్తున్నాయి. తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నారే తప్ప.. తదుపరి చర్యలపై పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

అనుమతి లేకుండానే..

- నిబంధనల ప్రకారం నిత్యావసరాలను ప్యాక్ చేయాలంటే తూనికలు, కొలతల శాఖ అధికారుల అనుమతులు తీసుకోవాలి.
- ప్యాకెట్‌పై ఎమ్మార్పీ, మ్యానుఫ్యాక్చరింగ్ డేట్, కమొడిటీ, టోల్‌ఫ్రీ నంబరు ఉండాలి.
- కానీ, అనుమతి లేకుండానే కిరాణాల్లో కందిపప్పు, పెసరపప్పు, చక్కెర, గోధుమపిండి, మైదాపిండి ప్యాక్ చేస్తూ విక్రయిస్తున్నారు.
- చిప్స్, మురుకులు, ఖార, బొంది తదితర తినుబండారాలనూ ప్యాకెట్లలోనే విక్రయిస్తున్నారు.
- హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద పెద్ద బస్తాల్లో సరుకులను తీసుకొచ్చి ప్యాకెట్లుగా మార్చి అమ్ముతున్నారు.



తనిఖీ చేస్తున్న అధికారి, (ఇన్‌సెట్‌లో) ప్యాకెట్‌లో వస్తువులు

- మరోవైపు.. పన్నులు తప్పించుకోవడానికి వ్యాపారులు జీరో దందాకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి.
- తద్వారా ప్రభుత్వానికి పన్నులు ఎగవేస్తున్నారని విమర్శలు ఉన్నాయి.

జాడలేని అధికారులు..

జిల్లాలో 20 మండలాలతో ఉండగా, ప్రస్తుతం జిల్లా ఇన్‌స్పెక్టర్‌తోపాటు, సిబ్బంది ఉన్నారు. జిల్లా పెద్దగా ఉండటం, అధికారులు తక్కువగా ఉండటంతో తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో వ్యాపారులదే ఇష్టారాజ్యంగా మారింది. షాపుల్లో తరాజు, బాట్లు వ్యత్యాసం రాకుండా నిత్యం తనిఖీలు చేయాల్సిన అధికారులు.. అలాంటివేమీ చేయడం లేదు. ఏటా కిరాణం వారు తరాజులు, బాట్లకు స్టాంపు వేయించుకోవాలి. ఎలక్ట్రానిక్ కాంటాల వారు సంవత్సరానికోసారి రెన్యూవల్ చేయించుకోవాలి.

గ్రామాల్లో అమ్మకాలు..

- గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా మసాలా పొడులు, ఖారాప్యాకెట్లు, వివిధ వస్తువులు, ఉల్లిగడ్డలు ట్రాలీల్లో తీసుకెళ్లి అమ్ముతుంటారు.
- వీటిని చిన్నచిన్న కవర్లలో పోసుకుంటూ విక్రయిస్తుంటారు.
- వీటిపై ఎలాంటి ముద్రణ, మ్యానుఫ్యాక్చరింగ్ డేట్ ఉండడంలేదు.
- ఇటీవల అధికారులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

ముద్రణ ఉండాలి

ప్రతీ ప్యాకెట్‌పై వస్తువుపై సంబంధిత కంపెనీ ముద్రణ, కన్జ్యూమర్ నంబరు, ఎమ్మార్పీ ఉండాలి. లేకుంటే చర్యలు తీసుకోవాలి. ప్రతీరోజు తనిఖీలు చేస్తున్నాం. నిబంధనలు అతిక్రమిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. ఎలక్ట్రానిక్ మిషన్ వారు సంవత్సరానికోసారి, తరాజుబాట్ల వారు రెండు సంవత్సరాలకోసారి ముద్ర వేయించుకోవాలి. లేకుంటే చర్యలు తీసుకుంటాం.

– అజీజ్‌పాషా, తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్

ధరల్లో తేడాలు..

కొన్ని షాపుల్లో ఎమ్మార్పీ కన్నా ఎక్కువ రేట్లకు విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. ముఖ్యంగా సినిమా థియేటర్లలో, బేకరీల్లో ఇష్టారాజ్యంగా రేట్లకు విక్రయిస్తున్నారు. కొత్త సినిమా రోజు సినిమా థియేటర్లలో ఒక కూల్‌డ్రింక్ రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. ఒక పాప్‌కార్న్ రూ.20కి అమ్ముతున్నారు. వాటర్‌బాటిల్ రూ.40, చిప్స్ రూ.20కి విక్రయిస్తున్నారు.

క్లుప్తంగా

ఆలయాల్లో శ్రావణ సందడి



ప్రధాన ఆలయంలో భక్తుల రద్దీ

ధర్మపురి: శ్రావణ మాసంలో చివరి సోమవారం సందర్భంగా వివిధ ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ స్వామి ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ దేవాలయాలు, అక్కపెల్లి శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: హైందవ ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మను సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో దహనం చేశారు. హైందవ ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆయన తక్షణమే క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. ఉదయనిధిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, లేదంటే దేశవ్యాప్త నిరసనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

14న జాబ్‌మేళా

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఈనెల 14న మినీజాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా ఉపాధి అధికారి దేవేందర్‌రావు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల వేతనం ఉంటుందన్నారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తిగల నిరుద్యోగ యువకులు తమ బయోడేటా (3 సెట్స్), విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో అదేరోజు జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9573381973, 9392664569 నంబర్లను సంప్రదించాలన్నారు.

మహిళను చంపుతానని బెదిరించిన వ్యక్తులపై కేసు

సారంగాపూర్(జగిత్యాల): గోడ నిర్మాణం చేయవద్దని కోరినందుకు దూషించి, చంపుతామని బెదిరించిన ఇద్దరిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. రేచపల్లి గ్రామంలో గంగలక్ష్మి ఇంటి హద్దుల్లో అదే గ్రామానికి చెందిన రాజేశం, సుజాత ప్రహరీ నిర్మిస్తున్నారు. తన హద్దుల్లో ఎందుకు గోడ నిర్మిస్తున్నారని గంగలక్ష్మి ప్రశ్నించింది. దీంతో రాజేశం, సుజాత కలిసి గంగలక్ష్మిని అసభ్య పదజాలంతో దూషించారు. చంపుతామని బెదిరించారు. ఈమేరకు బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు రాజేశం, సుజాతపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

కన్నీటి పర్యంతమైన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్(జగిత్యాల):ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అనుచరుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండీ ఇబ్రహీం సతీమణి జరీనా సోమవారం మృతిచెందారు. ఎమ్మెల్సీ ఇబ్రహీంను ఓదార్చుతూ కన్నీటిపర్యంతమయ్యారు. రేచపల్లి గ్రామానికి చెందిన జరీనా హైదరాబాద్‌లో గుండె శస్త్రచికిత్స నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తుండగా ఆస్పత్రిలో మృతిచెందింది. ఆమె ఆకస్మిక మృతి తనను తీవ్రంగా కలిచివేసిందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఆమె అంత్యక్రియల్లో పాల్గొని ఇబ్రహీంను ఓదార్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మొర ఆలకించండి

- ప్రజావాణిలో అభాగ్యుల వేడుకోలు
- సమస్యలు పరిష్కరించాలని విన్నపం



దరఖాస్తులు స్వీకరించి మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాలటౌన్: సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజల నుంచి వివిధ సమస్యలపై 25 దరఖాస్తులు అందాయి. అర్జీలు స్వీకరించిన కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అర్జీలను సాధ్యమైన మేరకు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బీఎస్ లత, దివాకరతోపాటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగమయ్యాయని పేర్కొంటూ పాలకవర్గం ప్రజావాణి ద్వారా కలెక్టర్ యాస్మిన్ బాషాకు ఫిర్యాదు చేశారు 2018 నుంచి 2022 వరకు వివిధ పన్నుల వసూళ్లు, ఖర్చులు, నూతన ఇంటి నిర్మాణాల అనుమతులుచ నల్లా కనెక్షన్ల అనుమతులు, వాటర్ ప్లాంట్ వేలం లేకపోవడం, పంచాయతీ ట్రాక్టర్‌ను సొంత పనులకు వాడుకోవడం, పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించకపోవడం తదితర అంశాలు, సర్పంచ్, ఉపసర్పంచ్ వివిధ పనుల గురించి తమతో చర్చించకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈమేరకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని పాలకవర్గ సభ్యులు గోగూరి తిరుపతిరెడ్డి, గంగాధర సురేశ్, జుంతుల లావణ్య, జిడిగే కావ్యశ్రీ, మందల గోపాల్‌రెడ్డి, మనుపాటి కనుకవ్వ, పీసేరి శిరిష, మొగిలి మల్లేశం తెలిపారు.

వసతి కల్పించండి



జిల్లా కేంద్రంలోని వివిధ కళాశాలల్లో చదువుతున్న తమకు ఎస్సీ, బీసీ ఉమెన్స్ హాస్టల్‌లో వసతి లేక ఇబ్బందులు పడుతున్నాం. గ్రామీణ ప్రాంతాలకు చెందిన మాకు హాస్టల్ వసతి లేక రాకపోకలు కష్టంగా ఉంది. ఈ విషయంలో కలెక్టర్ దృష్టి సారించాలి. మాకు హాస్టల్ వసతి కల్పించి ఆదుకోవాలి.

– కళాశాలల విద్యార్థినులు

పింఛన్ ఇప్పించండి



పీఎఫ్‌తోపాటు అన్ని అర్హతలు ఉన్న మాకు బీడీ కార్మిక పింఛన్ రావడం లేదు. కలెక్టర్‌చొరవ తీసుకుని బీడీ కార్మికులకు ఇచ్చే జీవనభృతి పింఛన్ మాకు కూడా ఇప్పించాలి.

– బీడీ కార్మికులు, లొత్తునూర్

కేసీఆర్ భయంతోనే ఇండియా పేరు మార్పు

- కోర్టుకు హాజరుకాని బండి రాజీనామా చేయాలి
- సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్



మాట్లాడుతున్న రవీందర్‌సింగ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: భారత రాష్ట్ర సమితి ఆవిర్భావంతోనే ప్రధాని మోదీ ఇండియా పేరు భారత్‌గా మార్చేందుకు సిద్ధపడ్డారని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ ఫైర్‌అయ్యారు. సోమవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంతకాలం డిజిటల్ ఇండియా, మేకిన్ ఇండియా అన్న మోదీ భారత రాష్ట్ర సమితితో భయపడ్డారన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పెద్ద బ్లాక్ మెయిలర్ అని మండిపడ్డారు. దురుద్దేశ పూర్వకంగా కేసులు వేసి, విచారణకు డుమ్మాలు కొడుతున్నారని ఆరోపించారు. ఎంపీ ప్రత్యర్థులను బ్లాక్ మెయిల్ చేసేందుకే కోర్టులో కేసులు వేస్తారన్నారు. అమెరికా వెళ్లి ఫుట్‌బాల్ ఆడే తీరిక ఉన్న సంజయ్‌కు కోర్టులో తాను వేసిన కేసుకు తానే హాజరుకానంత బిజీ ఏముందని ప్రశ్నించారు. న్యాయస్థానాల మీద ఏమాత్రం గౌరవంలేని, స్థానిక సమస్యలను పట్టించుకోని సంజయ్ వెంటనే తన పదవికిరాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేవలం వసూళ్ల కోసమే ఆయన అమెరికా పర్యటనకు వెళ్లారని, అక్కడ ఎంత వసూలు చేశారో ప్రజలకు వెల్లడించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో సంజయ్‌కు ఓటర్లు తగిన చెబుతారని హెచ్చరించారు.

వైభవంగా మహాలింగార్చన



వేములవాడ: రాజన్న సన్నిధిలో మాసశివ రాత్రిని పురస్కరించుకుని సోమవారం రాత్రి అద్దాల మండపంలో మహాలింగార్చనను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు అర్చకులు, భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

అంగన్‌వాడీలతో వెట్టిచాకిరీ చేయిస్తున్న ప్రభుత్వం

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి(ధర్మపురి):పనికి తగిన వేతనం ఇవ్వకుండా అంగన్‌వాడీ సిబ్బందితో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోందని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విమర్శించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. సంక్షేమ పథకాల అమలు, ఎన్నికల విధులు, వ్యాధుల సర్వేలు, బీఎల్వోలు.. ఇలా అన్ని కార్యక్రమాల్లో అంగన్‌వాడీ ఉద్యోగులను భాగస్వాములను చేస్తున్నారని అన్నారు. పనిభారం పెంచుతూ చిన్నచూపు చూస్తోందని పేర్కొన్నారు. గతంలో సమ్మెలు చేసిన నేపథ్యంలో సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో సేవలందిస్తున్న అంగన్‌వాడీలను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. సంక్షేమ పథకాలను వారికి వర్తింపజేయాలని కోరారు. హక్కుల సాధనకు అంగన్‌వాడీలు సాగించే ఉద్యమానికి తాము మద్దతుగా నిలుస్తామని అన్నారు. కాగా, 'చలో హైదరాబాద్' పేరిట రాజధానికి తరలివెళ్తున్న ఆశవర్కర్లను పోలీసులు అదుపులోకి తీసుకోగా లక్ష్మణ్‌కుమార్ వారిని కలిసి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు మల్లారెడ్డి, శంకర్, అనంతరెడ్డి, తిరుపతి, వంశీధర్‌రావు, కిషన్, రాజేందర్, విజయభాస్కర్, ప్రశాంత్, మల్లేశం, ప్రవీణ్, ఎల్లయ్య, రాజేశంగౌడ్, రమేశ్‌గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

డాక్టరు కోర్సు పూర్తిచేయాలనుంది

- దాతలూ సాయం చేయండి
- ఆర్థిక సాయం చేసి ఆదుకోండి
- ఆపన్నహస్తం కోసం సరస్వతీపుత్రుడి వేడుకోలు



తల్లిదండ్రులతో మహేందర్

రాయికల్(జగిత్యాల): కూలీబిడ్డ మహేందర్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించానని ఎంతో సంతోషపడ్డాడు. కానీ, కనీసం అడ్మిషన్ ఫీజు చెల్లించలేని దీనస్థితిలో ఉండటంతో మానసికంగా కుంగిపోతున్నాడు. రామాజీపేట గ్రామానికి చెందిన ఎనుగంటి నర్సయ్య– గంగవ్వ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ఇందులో మహేందర్ చిన్నవాడు. చదువులో ప్రతిభ చూపుతూ వస్తున్నాడు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఓ ప్రైవేట్ ఉన్నత పాఠశాలలో చదివాడు. ఇంటర్‌లో ప్రతిభ గుర్తించిన ఓ ప్రైవేట్ కళాశాల.. బైపీసీలో సీటు ఇచ్చింది. మరింత పట్టుదలతో చదివి ఇంటర్‌లో 982 మార్కులు సాధించాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాల యజమాన్యం.. ఉచితంగా కోచింగ్ ఇవ్వడంతో 2023లో నిర్వహించిన నీట్ ఫలితాల్లో 1,580 ర్యాంక్ సాధించాడు. దీంతో నల్గొండలోని ఓ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. ఒకవైపు ఎంబీబీఎస్ సీటు వచ్చిందనే సంతోషం కుటుంబంలో ఉండగా, మరోవైపు కనీసం అడ్మిషన్ ఫీజు, ఐదేళ్లపాటు సుమారు రూ.10 లక్షల ఇతర ఖర్చు భరించలేని దీనస్థితి ఆ కుటుంబాన్ని కుంగదీస్తోంది. తండ్రి కూలీ పనులు చేస్తుండగా, తల్లి బీడీకార్మికురాలు. ఆదాయం అంతంత మాత్రమే ఉంది. దీంతో డాక్టరు కోర్సు పూర్తిచేయడం కోసం ఆపన్నహస్తం అందించాలని విద్యార్థితోపాటు కుటుంబసభ్యులు కోరుతున్నారు.

ఎవరైనా దాతలు ఉంటే..
ఫోన్‌పే/గూగుల్‌పే : 91218 01593 నంబరుకు సాయం చేయాలని వేడుకుంటున్నారు.

అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే..

- కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి



వైద్యశిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

మల్లాపూర్(కోరుట్ల): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతున్న కాంగ్రెస్ పార్టీయే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి అన్నారు. సోమవారం ముత్యంపేటలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నియామకమైన కోమ్ముల చిన్నారెడ్డిని సన్మానించారు. అనంతరం సత్యం రెడ్డి మాట్లాడారు. కర్ణాటక ఫలితాల తర్వాత తెలంగాణలో మార్పు కోసం ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని అన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ నియంతల్లా పాలన చేస్తున్నాయని, వీటికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పీసీసీ ఫిషర్‌మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, కిసాన్‌కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు శశిందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమ్ముల చిన్నారెడ్డి, నాయకులు తోట సంతోష్, మామిడి రాజశేఖర్‌రెడ్డి, వంగ అశోక్‌యాదవ్, ఇప్పపెల్లి గణేశ్ పాల్గొన్నారు.

పార్టీల దిష్టిబొమ్మ దహనం

జగిత్యాల: 93 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఉండగా, 7 శాతం లేని అగ్రకులాలు వివిధ ప్రధాన పార్టీలకు నాయకత్వం వహిస్తున్నారని నిరసిస్తూ ధర్మసమాజ్ పార్టీ నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలో ఆ పార్టీల దిష్టిబొమ్మ దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ, ఏడురాజకీయ పార్టీలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయన్నారు. క్యాబినేట్ అంతా 93 శాతం అణగారిన, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో ఈనెల 12న అన్ని నియోజకవర్గాల్లో ధర్నా, రాస్తారోకోలు, 13న మండల కేంద్రాల్లో ధర్నా, రాస్తారోకోలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతి మహరాజ్, లక్ష్మీనారాయణ, శ్రీహరి, అశ్రాఫ్, కోటేశ్, జీవన్, రమేశ్, కృష్ణ, శివ, ఉపేంద్ర, నరేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తం

- డెంగీ నియంత్రణకు పకడ్బందీ చర్యలు



వైద్యశిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

సారంగాపూర్(జగిత్యాల):బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల్లో డెంగీ బాధితుల గుర్తింపు కోసం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సర్వే ప్రారంభించారు. సారంగాపూర్ మండలం పెంబట్ల, కోనాపూర్‌లో ఇద్దరు డెంగీ లక్షణాలతో మృతి చెందారనే గ్రామస్తుల సమాచారంతో వైద్యసిబ్బంది రెండు గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నాయి. కొద్దిపాటి జ్వరం వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలని పల్లెవాసులకు అవగాహన కల్పిస్తున్నారు. అయితే, పదిరోజులుగా డెంగీ జ్వరాలు వస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. రక్తపరీక్షల తర్వాత ఎలాంటి జ్వరాలనే విషయాలను నిర్ధారిస్తామని వైద్యులు చెబుతున్నారు. ఈమేరకు అనుమానితుల నుంచి సేకరించిన రక్తనమూనాలను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి పంపిస్తున్నారు. అక్కడి తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని, పేషెంట్లు ఎవరూ ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లవద్దని సిబ్బంది సూచించారు.

పెంబట్ల, కోనాపూర్‌లో నమూనాల సేకరణ

ఇప్పటికే ఈ రెండు గ్రామాల్లో డెంగీ లక్షణాలు ఉన్నాయనే అనుమానంతో పెంబట్లలో 78 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇందులో 39 మంది జ్వర తీవ్రత ఆధారంగా రక్తనమూనాలు సేకరించారు. ఇందులో ఇద్దరికి డెంగీ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు అనుమానిస్తున్నారు. కోనాపూర్‌లో 62 మందికి పరీక్షలు నిర్వహించారు. 27 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఇందులో ఇద్దరికి డెంగీ లక్షణాలు ఉన్నట్లు అనుమానిస్తూ జిల్లా వైద్యశాలకు రక్తనమూనాలే పంపించారు.

ఒకటే డెంగీ కేసు

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని దాదాపు 250 మంది నుంచి రక్త నమూనాలు సేకరించాం. ఇందులో నలుగురు అనుమానితులు ఉండగా, ఒక్కరికి మాత్రమే డెంగీ పాజిటివ్‌గా తేలింది. పేషెంట్‌ను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నాం.

– రాణిమైత్రీరెడ్డి, మండల వైద్యాధికారి

అందుబాటులో ఉన్న మందులు..

డెంగీతోపాటు, ఇతర జ్వరాలకు అవసరమైన పారసిటమాల్, డాక్సిసైక్లిన్, సెఫిక్షిన్ తదితర మందులు ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచారు. ఇంకా అవసరమైన మందులను పేషెంట్లకు అందజేస్తున్నారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే..

రెండు మండలాల్లో వైద్యసిబ్బంది ఇంటింటా సర్వే చేస్తున్నారు. రోజువారి వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. సారంగాపూర్ మండలంలో 3 బృందాలు, బీర్‌పూర్ మండలంలో మూడు బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి.

సమగ్రశిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

- ఎస్టీయూ నేత శనిగరపు రవి



మాట్లాడుతున్న శనిగరపు రవి

జగిత్యాల: సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రవి కోరారు. జిల్లా కేంద్రంలో సోమవారం రిలే దీక్ష చేపట్టిన సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడారు. సమగ్ర శిక్షా పరిధిలో మొత్తం 27,168 పోస్టులు ఉండగా 25,728 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, మిగిలిన ఉద్యోగులు అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో కొనసాగుతున్నారని పేర్కొన్నారు. వీరికి ఎలాంటి బెనిఫిట్స్ లేకపోవడంతో పాటు, ఉద్యోగ భద్రత లేదని తెలిపారు. వీరిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బైరం హరికిరణ్, ఎస్ఎస్ఏ ఉద్యోగులు నారాయణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నిరవధిక సమ్మె ప్రారంభం



అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగుల గొడుతున్న సిబ్బంది

ధర్మపురి: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం సమ్మె ప్రారంభించారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు వేసి ఉదయం 10 గంటలకు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న ఆందోళనకారులు.. సాయంత్రం 4 గంటల వరకూ నిరసన తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దినేశ్ ఆధ్వర్యంలో వారికి మద్దతు తెలిపారు. నాయకులు సింహరాజు ప్రసాద్, వేముల రాజేశ్, అశెట్టి శ్రీనివాస్, రఫియొద్దీన్, అప్పం శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తాళాలు ధ్వంసం

అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెతో మండలంలోని మొత్తం 66 అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. అయితే, ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీ ఆధ్వర్యంలో ఆర్ఐ, సూపర్‌వైజర్లు, పోలీస్ బందోబస్తు మధ్య ధర్మపురి, ఇప్పలపల్లె, నక్కలపేట, జైనా, రాజారం, దొంతాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టారు. తమ పోరాటానికి మద్దతు తెలపాల్సిన ఐసీడీఎస్ అధికారులు తాళాలు పగులగొట్టడం ఏమిటని అంగన్‌వాడీ టీచర్ల సంఘం అధ్యక్షురాలు మాధవీలత, నాయకులు లక్ష్మి, రాణి, శోభ ప్రశ్నించారు. కాగా, తాళాలు పగులగొట్టిన విషయంపై సీడీపీవో వాణిశ్రీని సంప్రదించగా, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిల్వఉన్న పోషక పదార్థాలు సమ్మెతో చెడిపోతాయని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాళా లు పగులగొట్టి సరుకులను స్థానిక ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించామన్నారు.

నంది వాహనంపై రామలింగేశ్వరస్వామి ఊరేగింపు



వాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ స్వామి అనుబంధ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసంలో చివరి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సాయంత్రం ఉత్సవ మూర్తులైన శ్రీరామలింగేశ్వర స్వాములను నంది వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. దారి పొడవునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

కొండపై భక్తజనం





కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం సందర్భంగా సోమవారంరాత్రి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మంగళవారం స్వామివారిని దర్శించుకునేందుకు సిద్ధమయ్యారు. ఈమేరకు ఆలయ ఆవరణలో మొక్కు నిద్రలు తీశారు. అయితే, తాగునీటి కొరతతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.